
# యువతరం కదిలింది!



'భారతమిత్రం' వారపత్రిక . . . *29* మే, *1977*

"రావయ్యా! రావయ్యా... నీకోసమే చూస్తున్నాను. పట్నం పోయావట కదా... ఏమిటి విశేషం?"

– అన్నాడు రచ్చబండ మీద కూర్చున్న రాజయ్య... అటుగా వస్తున్న రామయ్యతో.

"అవునయ్యా... అబ్బాయికి జ్వరం వస్తోందని ఎవరో చెప్తే ఉండబట్టలేక పోయి చూసొచ్చాను. ఉత్తరం రాస్తే కంగారుపడతామని రాయనే లేదు. తెలిసింది కాబట్టి చూసొచ్చాను. ఇప్పుడు తగ్గిందనుకో! కాకపోతే, కొంచెం బలహీనంగా ఉన్నాడు..." అన్నాడు రామయ్య– రాజయ్య ప్రక్కనే కూర్చుంటూ.

"అలాగా! మరి, నీ వెంట తెచ్చేయలేకపోయావు?" అన్నాడు రాజయ్య.

"తెద్దామనే అనుకున్నాను. వారంరోజుల్లో సెలవులు ఇస్తున్నారట... ఇయ్యగానే తనే వస్తానని పంపించేశాడు!"

– అన్నాడు రామయ్య చుట్ట ముట్టిస్తూ.

"ఇంతకీ... మన ఊరికి మంచినీటి బావి వచ్చేట్టా, లేనట్టా?" అన్నాడు రాజయ్య ఆవులిస్తూ.

"నేను ఊరుకోలేదయ్యా! అక్కడికీ పట్నంలో సెక్రటేరియట్‌కి వెళ్లి మన కాగితం సంగతి విచారించా. అసలు ఆ కాగితం కనిపించి ఛస్తేనా! పంచాయతీరాజ్ శాఖలో ఉంటుందని కొందరూ, రెవెన్యూ శాఖలోనని ఇంకొందరూ, కాదు కాదు– సేద్యపు నీటి శాఖలోనని మరికొందరూ అన్నారు. అసలు ఆ సమాధానాలైనా ఎవరైనా సరిగ్గా చెప్తేనా? అందులోనూ పల్లెటూరివాడినయ్యే– నా మొహం ఎవరు చూస్తారు? ఈ బాధపడలేక ఆ విషయాలన్నీ అబ్బాయిని కనుక్కురమ్మని అన్నాను!" అన్నాడు రామయ్య.

వాళ్ళు మాట్లాడుకుంటుండగా ఇంకా నలుగురు గ్రామస్తులు చేరారు.

ఆ గ్రామానికి ఉన్న రావిచెట్టు చుట్టూ ఉన్న గట్టు ఏనాడో బ్రిటిష్‌వాళ్ళ కాలంలో ఎవరో పుణ్యాత్ములు కట్టించారు. అప్పటినుంచీ అదే ఆ గ్రామస్తులందరికీ రచ్చబండ అయింది. ఎవరికీ ఎప్పుడు ఖాళీ ఉంటే అప్పుడు ప్రొద్దున, సాయంత్రం అన్న తేడా లేకుండా, చిన్నా పెద్దా అనే భేదం లేకుండా అక్కడ చేరి లోకం రాజకీయాలు, గ్రామస్తుల సమస్యలూ అన్నీ చర్చించుకుంటూ ఉంటారు.

ఆ గ్రామంలోని మంచినీటి బావి క్రమేపీ చెడిపోవడం మొదలుపెట్టింది. నీటి అడుగు నుంచి విషవాయువులు రావడం ప్రారంభించి నీరు కలుషితమైపోయి, అది త్రాగిన వారికి వ్యాధులు రాసాగాయి. అంతటితో ఆ బావిని పాడు పెట్టారు. అప్పటినుండి

ఊరికి రెండు మైళ్ల దూరంలో ఉన్న కాలువ నుంచి మంచినీళ్లు తెచ్చుకోవలసిన అగత్యం ఏర్పడింది.

ఊరిలో మరొక మంచినీటి బావిని త్రవ్వించాలనే ప్రతిపాదన వచ్చింది.

అయితే... దానికి అంచనా వేసిన వ్యయం గ్రామపంచాయతీకి తలకి మించిన భారం అయింది. అందువల్ల ఆ బావిని త్రవ్వించే విషయం వారు జిల్లా పరిషత్‌కి నివేదించారు.

జిల్లా పరిషత్‌లో ఆ కాగితం ఫైలులోకి ఎక్కడానికే కొన్ని నెలలు పట్టింది. ఆ ఫైలు- కమిటీ ముందుకి వచ్చేసరికి మరికొన్ని నెలలు పట్టింది. తీరా కమిటీ ముందుకి వచ్చాక ఆ బావి త్రవ్వించే విషయంలో ఎన్నెన్నో సాంకేతికపరమైన అభ్యంతరాలు అడ్డుపడ్డాయి. ఆ దశలో దానిని జిల్లా పరిషత్ వారు కొన్ని వివరణలు కోరుతూ, మరికొన్ని సూచనలు చేస్తూ ప్రభుత్వానికి వ్రాశారు. అంతటితో ఆ కాగితం పద్మవ్యూహంలో ప్రవేశించిన అభిమన్యుడి లాగా తిరిగి బయటకు రాలేదు. అభిమన్యుడి విషయంలో కనీసం శవమైనా దక్కింది కాని, ఈ కాగితానికి శాల్తీ కూడా గల్లంతయ్యింది.

ఈ కాగితం ఆ విధంగా అనాథ మరణం చెందేసరికి- దగ్గర దగ్గర మూడేళ్లయింది.

ఈలోగా గ్రామస్తులు ఆ కాగితం విషయంలో పంచాయితీ నుంచి ప్రభుత్వం వరకూ లెక్కలేనన్ని రిమైండర్లు పంపారు. వాటికి పోస్టేజి క్రిందే మూడంకెలలో డబ్బు ఖర్చయింది.

ఈ పరిస్థితుల్లో గ్రామస్తులు ఏంచేయాలో దిక్కుతోచక ఊరుకున్నారు.

ఆరోజు రామయ్య కొడుకు రాజు పట్నం నుంచి వచ్చాడు. సాయంత్రం ఊరిలోకి రాగానే, రచ్చబండ దగ్గర కూర్చుని మాట్లాడుకుంటున్న నలుగురూ ఆప్యాయంగా పిలిచారు.

రాజు నిలబడే ఉంటే- "కూర్చుని మాట్లాడవయ్యా! ఎంత పట్నంలో చదువు కుంటున్నా నువ్వు ఈ ఊరివాడివే!" అన్నాడు రాజయ్య.

"మావాడికి ఆ భేషజాలేం లేవు..." అన్నాడు రామయ్య.

"పెద్దవాళ్ళ ముందు నుంచోవాలి కదా అని కూర్చోలేదు..." అంటూ కూర్చున్నాడు రాజు.

"చూశావా మావాడి వినయం!" అన్నాడు రామయ్య గర్వంగా.

"అవునయ్యా... వాడు మీ అబ్బాయి కదా!" అని, "రాజూ! మనూరి మంచినీటి బావి విషయం పట్నంలో కనుక్కున్నావా?" అన్నాడు రాజయ్య.

"మూడు నాలుగు సార్లు వెళ్లి విచారించాను బాబాయ్! కాని, అసలు ఆ కాగితం పత్తాయే లేకుండా పోయింది. మళ్లీ కాపీ తీయించి పంపిచవచ్చునుకో- కాని, ఈ లెక్కన బావి మంజూరై తయారయ్యేసరికి ఎన్నేళ్లు పడ్తుందో చెప్పలేం!" అన్నాడు రాజు.

"అయితే... ఇంకా బావి గురించి ఆశ వదలుకోవాల్సిందేనా? మరి, మనవాళ్ళు రోజూ కాలవకి పోయి నీళ్లు తెచ్చుకోవలసిందేనా?" అన్నాడు రాజయ్య దిగులుగా.

"బాబాయ్! ఈ విషయం నేను కూడా తీవ్రంగా ఆలోచించాను. మనం ఒకలాగ ఎందుకు చేయకూడదు?" అన్నాడు రాజు.

"ఏమిటది..?" అన్నారు అందరూ ఆసక్తితో.

"బావి త్రవ్వించడానికి ఎంత ఖర్చవుతుందంటావు?" అన్నాడు రాజు తిరిగి.

"ఎంతలేదన్నా ఐదు వేలవుతుందబ్బాయ్!" అన్నాడు రాజయ్య.

"ఇందులో కూలీల కయ్యేదేగా ఎక్కువ ఖర్చు?"

"అవును..."

"ఇటుకా, సిమెంటులకు ఒక పదిహేనొందలు సరిపోతుందా?"

"ఓ బ్రహ్మాండంగా..!"

"అయితే, ఒక పని చేద్దాం! ఇటుక, సిమెంటుల కోసం పంచాయతీ వాళ్ళు ఎంత పెట్టుకోగలిగితే అంత పెట్టుకోమనండి- మిగిలింది చందాలు వేసి, గ్రామస్తుల దగ్గర వసూలు చేద్దాం. ఇంక కూలీ పనికి- ఊరిలో చేవ ఉన్న వాళ్ళందరూ చిన్నా, పెద్దా అనే భేదం లేకుండా వద్దాం. పారలూ, పలుగులూ, పళ్ళికలూ ఎవరికి అందుబాటులో ఉన్నది వాళ్ళు తెచ్చుకుందాం. ఈ విధంగా చేస్తే అతితొందరగా బావి తయారవుతుంది!" అన్నాడు రాజు.

"భేష్... ఏంబాగా చెప్పావయ్యా! అట్లాగే చేద్దాం. రామయ్యా... ఎట్లాగైనా పట్నంబుఱ్ఱ పట్నం బుఱ్ఱేనయ్యా! మనం మహజర్లకి పెట్టిన డబ్బు దీనికి పెట్టిఉంటే- సగం సామాగ్రి వచ్చి ఉండేది!" అన్నాడు రాజయ్య పరమానందంతో.

"అంతేనా... బావి ఏనాడో వచ్చి ఉండేది! మనవాళ్ళు ఇంతకాలం బాధపడేవాళ్ళు కాదు!" అన్నాడు రామయ్య.

"అందుకే ఇతరుల మీద ఆధారపడడం కంటే మన కాళ్ల మీద మనం నిలబడడం ఎప్పుడూ మంచిది!" అన్నాడు రాజు.

"అవునవును..." అంటూ అందరూ తలలాడించారు.

రాజు వేసిన పథకం రూపుదాల్చడానికి ఎక్కువ కాలం పట్టనే లేదు. ఆ గ్రామంలో యువతరం లేచింది... రాజు నాయకత్వంలో ఒక్కట్టిగా కదిలింది. వారికి అండదండలుగా పెద్దలూ, పిన్నలూ నిలిచారు.

చూస్తూండగానే గ్రామంలో చక్కని విశాలమైన, మంచినీటి బావి తయారయింది. వారి సత్సంకల్పానికి భూమాత కూడా కరుణించి తియ్యటి నీటిని ప్రసాదించింది.

*'భారతమిత్రం' వారపత్రిక . . . 29 మే, 1977*



అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...